
భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 19.0





ఇసుక లారీలకు అడ్డంగా బైక్‌లు అడ్డుపెట్టిన దృశ్యం

అనుమతులు చూపితేనే వదులుతాం

నడిపూడి ర్యాంప్‌లో ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

పెనుగొండ, మార్చి3: పెనుగొండ మండలం నడిపూడి ఇసుక ర్యాంప్‌లో మూడు రోజులుగా రాత్రి, పగలు ఇసుక తవ్వకాలు జరుపు తున్నా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. పర్యావరణ అను మతులు లేవని జిల్లాస్థాయి అధికారులు చెబుతున్నారు. కాని ర్యాంప్ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరించడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఇసుక ఎగుమతులు జరుపుతుండగా గ్రామస్థులు లారీలను అడ్డుకున్నారు. దీంతో ర్యాంప్ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు వచ్చి గ్రామస్థులతో మాట్లాడారు. అనుమతి పత్రాలు చూపిస్తేనే లారీలను వదులుతామని చెప్పారు. అనుమతి పత్రాలు చూపించి తోలుకోవాలని ర్యాంప్ నిర్వాహకులకు పోలీసులు సూచించారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ర్యాంప్‌లో హైడ్రామా చోటు చేసుకుంది. నిర్వాహకులు అనుమతి పత్రాలు చూపి స్తామంటూ సాయంత్రం వరకు చెబుతూ వచ్చారే కానీ చూపించలేక పోయారు. ఇటీవల గత కలెక్టర్ పి.ప్రశాంతి సైతం ఇసుక ర్యాంప్‌ను సందర్శించారు. ర్యాంప్‌నకు అను మతులు లేవని ఎవరైనా ఇసుక తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయి నప్పటికి ర్యాంప్‌లో ఇసుక అక్రమార్కులు దందా కొనసాగిస్తున్నారు.

ఇసుక దోపిడీ



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

- ఎన్నికల ముందు అక్రమ తవ్వకాలు
- అధికార పార్టీ నేతలే కీలక వ్యక్తులు
- రాత్రి వేళల్లో అక్రమ రవాణా
- కన్నెత్తి చూడని అధికారులు

సార్వత్రిక ఎన్నికలు తరుముకొస్తున్నాయి.ఎంత సంపా దించకున్నా మరో నెల రోజులే.. రాబోయే ప్రభుత్వంలో అవకాశం ఉండదు. దీపం ఉండగానే ఇళ్లు చక్క బెట్టుకావాలి. ఇసుక మాఫియా ఈ సూత్రాన్ని బాంగా వంటపట్టించు కుంది. అధికార పార్టీ నాయకులే ఇసుక మాఫియా అవతారమెత్తారు. అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు. అధికారులు తనిఖీలు నిర్వహిస్తే ముందుగానే లీకులు వెళుతున్నాయి.దాంతో ఇసుక ర్యాంప్‌ల ఎక్స్ కవేటర్లు నుంచి మాయమై పోతున్నాయి. ఆ తర్వాత మళ్లీ తవ్వకాలు సాగిస్తున్నారు. జిల్లాలో ఇంకా అనుమతులు రాకుండానే దందా సాగిస్తున్నారు. సిద్ధాంతం నుంచి నర్సాపురం వరకు గోదావరి తీరంలో ఆరు ర్యాంప్‌లను అనుమతి కోసం పెట్టారు. ప్రభుత్వ స్థాయిలో ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అంతలోగానే అక్రమార్కులు తవ్వకాలు సాగించే స్తున్నారు. దందాను అడ్డుకోవాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఆచంట నియోజకవర్గం, యల మంచిలి మండల పరిధిలో తవ్వకాలు నిర్వహించి అక్రమంగా తరలిస్తున్నారు. ఇసుక దందాను తీర ప్రాంతాలు గ్రామస్థులు అడ్డుకుంటున్న సందర్భాలు ఉంటున్నాయి. అయినా సరే మట్టి మాఫియా చెలరేగిపోతోంది. గడచిన ఐదేళ్లలో అక్రమ రవాణాకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. బొండు ఇసుక జిల్లా సరిహద్దులు దాటింది. జగనన్న కాలనీల పూడిక పేరుతో కోట్ల రూపాయలు వ్యాపారాలు నిర్వహించారు. అధికార పార్టీ నాయకులకు కాసుల వర్షం కురిసింది. బొండు ఇసుకను తరలించేందుకు సొంతంగా వాహనాలు కూడా సమకూర్చుకున్నారు. నిత్యం ఇతర ప్రాంతాలకు తరలించారు. అధికారులు కూడా ఏమీ చేయలేకపోయారు.

అనుమతులు ఏమో !

ఇసుక ర్యాంప్‌లకు అనుమతులు ఇచ్చినట్టయితే స్థానిక రెవెన్యూ అధికారులు తెలియాలి. ఇసుక తవ్వకాల పర్యవేక్షణ రెవెన్యూ అధికారులపై ఉంటుంది. పరిమితికి మించి తవ్వకాలు సాగిస్తే అడ్డుకోవాల్సిన బాధ్యత మైనింగ్ శాఖపై ఉంటుంది.

జిల్లాలో అధికార పార్టీ నాయకుల ఒత్తిడి తట్టుకోలేక మైనింగ్ శాఖలోని కీలక అధికారి సుదీర్ఘ సెలవుపై ఉన్నారు. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి బాధ్యతలు వహిస్తున్నారు. ప్రధానంగా మండల స్థాయిలో రెవెన్యూ అధికారులకు ఇసుక ర్యాంప్‌ల అనుమతులు విషయం తెలియాలి. ప్రభుత్వం సమాచారం ఇవ్వాలి. అనుమతులపై రెవెన్యూ అధికారులు నోరెళ్ల బెడుతున్నారు. మైనింగ్ అధికారులు సెలవులో ఉన్నారు. ఇన్‌ఛార్జిలు స్పందించడం లేదు. మొత్తంపైన అక్రమ రవాణాతో మాఫియా చెలరేగి పోతోంది. ఆచంట నియోజకవర్గ పరిధిలోని తీర ప్రాంత గ్రామాల్లో తవ్వకాలు సాగుతున్నాయి.

అధిక ధరలతో దోపిడీ

అప్పనంగా తవ్వకాలు సాగిస్తున్న మాఫియా ధరలు కూడా తగ్గించడం లేదు. లారీ ఇసుక రూ. 14 వేల నుంచి రూ. 15 వేలకు అమ్మకాలు సాగిస్తున్నారు. వైసీపీ హయాంలో రియల్ ఎస్టేట్ పతనమైంది. నిర్మాణాలు తగ్గుముఖం పట్టాయి. లేదంటే ఇసుకకు డిమాండ్ ఏర్పడి ధరలు మరింత పెంచేసేవారు. బ్లాక్ మార్కెట్‌కు అడ్డూ అదుపూ లేకుండా పోయేది. ఇసుకకు అంతగా డిమాండ్ లేకపోయినా సరే ధరలు తగ్గించడం లేదు. ప్రభుత్వ ధరల పేరుతో మాఫియా అడ్డంగా దోచేస్తోంది. తెలుగుదేశం హయాంలో ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేశారు. అధిక ధరలకు అడ్డుకట్ట వేసేందుకు ఉచిత విధానాన్ని తెరపైకి తెచ్చారు. తవ్వకం, రవాణా చార్జీలు మాత్రమే వసూలు చేశారు. దాంతో ఇసుక గరిష్టంగా రూ. 10 వేలకు లభ్యమయ్యేది. ఒక్కోసారి రూ. 9 వేలకే అమ్మకాలు సాగించిన సందర్భాలున్నాయి. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత ఇసుక విధానానికి స్వస్తి పలికారు. కొన్నాళ్లపాటు ఇసుక లేకుండా చేశారు. భవన నిర్మాణ కార్మికులను రోడ్డున పడేశారు. తర్వాత ప్రభుత్వమే విక్రయాలు సాగించింది. ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే అమ్మకాలు సాగాయి. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు అడ్డంగా దోచుకున్నారు. ఆ తర్వాత ప్రైవేటు ఏజన్సీకి బాధ్యతలు అప్పగించారు. అనుమతులు ముగిసిన తర్వాత ఏజన్సీ ముసుగులో అధికార పార్టీ నేతల కనుసన్నల్లో ఇసుక ర్యాంప్‌లు నడిచాయి. నిల్వలు చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిల్వల నుంచి అమ్మకాలు సాగించారు. బొండు ఇసుకను ప్రత్యేకంగా తరలించి కోట్లు గడించారు.

పంచాయతీలకు మొండి చేయి

స్థానిక సంస్థలకు మాత్రం ప్రభుత్వం మొండి చేయి చూపింది. ర్యాంప్‌లనుంచి ఎంత మేర ఇసుక తవ్వకాలు సాగించారనే దానిపై లెక్కా పత్రం లేకుండా పోయింది. ఇప్పటికే స్థానిక సంస్థలకు ప్రభుత్వం సీనరేజీ విడుదల చేయలేదు. కోట్ల రూపాయలు బకాయి పడింది. నిధుల కోసం పంచాయతీలు ఎదురుచూస్తున్నాయి. జిల్లా పరిషత్, మండల పరిషత్‌లకు సీనరేజీ చెల్లించకుండా ప్రభుత్వం చేతులెత్తేస్తోంది.

విస్సాకోడేరులో మూడు మట్టి టిప్పర్లు స్వాధీనం

పాలకోడేరు, మార్చి 3 : విస్సాకోడేరులో నిబం ధనలకు విరుద్ధంగా తిరుగుతున్న మూడు మట్టి టిప్పర్లను ఆదివారం స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించినట్లు పాలకోడేరు ఎస్ఐ నాళం శ్రీనివాస రావు తెలిపారు. భీమవరం నుంచి విస్సాకోడేరు శివారు వంకాయిలపాలెంలో లేఅవుట్‌లోకి నాలుగు రోజుల నుంచి టిప్పర్లతో మట్టి తరలిస్తు న్నరు. ఈ క్రమంలో టిప్పర్లు అధికలోడుతో అతి వేగంగా రహదారులపై చక్కర్లు కొట్టడంతో స్థాని కుల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్ఐ తెలి పారు. టిప్పర్లపై బరకాలు కట్టకుండా వెళ్లడంతో మట్టి గడ్డలు రహదారిపై పడి ద్విచక్ర వాహనదా రులు సైతం ప్రమాదాల బారిన పడుతున్నారని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో మూడు టిప్ప ర్లను సీజ్ చేసి జరిమానా విధించవలసిందిగా మైనింగ్‌శాఖకు సిఫార్సు చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్లపై మట్టి తరలించిన ప్పుడు కచ్చితంగా నిబంధనలు పాటించాలని లేని పక్షంలో వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

కాయ్ రాజా కాయ్..!

నరసాపురం సీటుపై రూ.10 కోట్లు దాటిన పందేలు

మధ్యవర్తిగా క్రికెట్ బుకీ



నరసాపురం, మార్చి 3; నరసా పురంలో ఎన్నికల పందేలు హద్దు మీరుతున్నాయి. ఇంకా నోటిఫికేషన్ వెలవడలేదు..టిక్కెట్ల కేటాయింపు కొలిక్కి రాలేదు. అయితే పందేలు మాత్రం జోరందుకున్నాయి. అది కూడా గెలుపుపై కాదు..సీటు ఎవరికి ఇస్తారా అనేదానిపై కాయ్ రాజా కాయ్ అంటూ కాలు దువ్వుతున్నారు. పొత్తులో భాగంగా తమ నాయకుడికే టిక్కెట్ దక్కుతుందని ఒక పార్టీకి చెందిన క్యాడర్ పందేలకు దిగారు. మొదట్లో సమానంగా సాగిన పందేలు నేడు కోసు పందాలకు దారి తీశాయి. టిక్కెట్‌పై ధీమా ఉన్న ఒక నాయకుడి క్యాడర్ ఒకటికి ఐదు రెట్లు ఆఫర్ చేస్తుండటంతో రెండు రోజుల నుంచి ఈ పందేలు కోట్లలోకి చేరాయి. చాలా మంది అప్పులు తెచ్చి మరీ కాస్తున్నారు. లక్ష రూపాయలు కాస్తే ఐదు లక్షలు వస్తుందన్న ధీమాతో చాలా మంది వస్తువుల్ని సైతం తాకట్టు పెట్టి పందేల బరిలో దిగుతున్నారు. ఇటు పోటీలో ఉన్న ఇద్దరు నాయకులు కూడా టిక్కెట్‌పై ధీమాతో వ్యక్తం చేస్తుండటంతో క్యాడర్‌లో ఉత్సాహం మరింత పెరిగింది. ఇప్పటి వరకు వీరిద్దరిపై సుమారు రూ.10 కోట్లపైనా పందేలు జరిగిన్నట్లు అంచనా వేస్తున్నారు. ఇద్దరూ ఒకే పార్టీకి చెందిన నాయకులు కావడంతో టిక్కెట్ కేటాయింపులో ఏమాత్రం తేడా జరిగినా కోసు పందెం కాసిన వారంతా భారీగా నష్టపోతారన్న చర్చ తీర ప్రాంతంలో నెలకొంది.

రంగంలోకి క్రికెట్ బుకీ..

ఇక ఈ పందాలకు మధ్యవర్తిగా ఓ క్రికెట్ బుకీ వ్యవహరిస్తున్నారన్నారు. రెండు వైపులా పందేలను ఇతగాడే చూపిస్తున్నారు. ఇందుకు గాను పెద్ద మొత్తంగా కమీషన్ డిమాండ్ చేస్తున్నారు. మొదట్లో కోసు పందేలు లేవు. లక్షలోనే ఉండేవి. పార్టీలోని ఓ సీనియర్ నాయకుడి వద్ద ఇరువురు పందెం మొత్తం కలిపేవారు. ఎప్పుడైతే క్రికెట్ బుకీ ఎంటర్ అయ్యాడో కోసు పందేలకు తెరలేచింది. మొదట్లో ఒకటికి రెండు రెట్లు ఉన్న పందెం నేడు ఐదు రెట్లు వరకు వెళ్లింది..గతంలో ఈ బుకీ జిల్లాలో బెట్టింగ్ నిర్వహించేవాడు. అయితే పోలీసులు నిఘా పెట్టడంతో ఇతగాడు మకాం మార్చాడు. హైద్రాబాద్, బెంగళూర్‌లలో ఉంటూ అక్కడ నుంచి ఫోన్ల ద్వారా దందా నడిపి స్తున్నాడు. ప్రస్తుతం ఎన్నికల సీజన్ కావడంతో ఈ బుకీ రూటు మార్చాడు. క్రికెట్‌లో బెట్టింగ్‌లు కాసే వారితో సంప్రదించి రెండు వైపులా పందేలను సెట్ చేస్తున్నాడు. దీంతో రోజు రోజుకు పందేలు హద్దులు దాటుతున్నాయి.

కాంగ్రెస్‌లో.. కదనోత్సాహం



ఆశావహుల దరఖాస్తుల పరిశీలన

- ఎంపీ సీట్లకు పోటీకి రెడీ
- కాంగ్రెస్‌తో జతకడుతున్న వామపక్షాలు
- కొన్ని అసెంబ్లీ స్థానాలకు ప్రతిపాదన
- ఈ వారంలోనే కొలిక్కి వచ్చే అవకాశం

వచ్చే ఎన్నికల్లో జనంలోకి చొచ్చుకుపోవడమే కాకుండా తమ ఉనికిని కాపాడుకోవడా నికి కాంగ్రెస్‌తో పాటు వామపక్షాలు సిద్ధమయ్యాయి. పీసీసీ చీఫ్‌గా షర్మిల నియా మకం తర్వాత కాంగ్రెస్‌కు కాస్త ఊపిరి వచ్చింది. నియోజక వర్గాల వారీగా పోటీ చేసేందుకు కొందరు ముందుకు వస్తున్నారు. క్షేత్ర స్థాయిలో తమ ఉనికిని కాపాడు కునేందుకు వామపక్ష పార్టీలు కాంగ్రెస్‌తో జతకట్టి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నాయి. తమకు ఆశాజనకమైన, కేడర్ ఉన్నచోట పోటీకి వీలుగా ఆయా స్థానాల్లో పొత్తు ప్రతి పాదిస్తున్నారు. సాధ్యమైనంత త్వరలోనే సీట్ల కేటాయింపుపై తుది నిర్ణయం తీసుకోబోతున్నారు.

- ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి

కాంగ్రెస్‌లో ఏం జరుగుతోంది..

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కొంతలో కొంతైనా ప్రజల మధ్య నానేలా పార్టీ బలపడాలని కాంగ్రెస్ భావిస్తోంది. దీనికి తగ్గట్టుగా షర్మిల నాయకత్వంలో సీనియర్లు రంగంలోకి దిగారు. ఇంతకుముందు మాదిరిగా కాకుండా ఈసారి పోటీ చేయదలచిన అభ్యర్థులపైన దృష్టి పెట్టారు. సామాజికవర్గాల వారీగా కాస్తంత స్థితిగతులు పరిశీలించడమే కాకుండా ఇతర పార్టీల నుంచి బయటపడి టిక్కెట్ కోరుకుంటున్నవారి వివరాలపైన క్షుణ్ణంగా పరిశీలనకు దిగారు. గడచిన కొన్నాళ్లుగా వివిధ అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి దరఖాస్తులను స్వీకరించగా తాజాగా సీనియర్ల సమక్షంలోనే పరిశీలిస్తున్నారు. ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి సుమారు 50 మందికి పైగా టిక్కె ట్ ఆశించి దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన చింతలపూడి నుంచి పీసీసీకి దరఖాస్తులు అందాయి. ఏలూరు లోక్‌సభ స్థానానికి ఆరుగురు పోటీ పడుతున్నారు. అదే నరసాపురం లోక్‌సభా స్థానం పరిధిలో నలుగురు, మిగతా అసెంబ్లీ స్థానాల నుంచి మరో 20 మంది దరఖాస్తు చేశారు. వాస్తవానికి గడచిన ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అంతంత మాత్రంగానే ఓట్లు లభించాయి. కానీ ఈసారి పీసీసీ చీఫ్ షర్మిల రాకతో ఓట్లు పుంజుకుంటాయని ఆశావహులు అంచనాలో వున్నారు. ఈ క్రమంలోనే ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాలకు పోటీ చేసేందుకు సంతృప్తికర స్థాయిలో దరఖాస్తులు చేయడం కాంగ్రెస్‌లో కొత్త పరిణామం. కాంగ్రెస్‌లో దీర్ఘకాలికంగా ఉన్నవారితోపాటు ఈ మధ్యనే పార్టీలో చేరినవారు దరఖాస్తు చేసుకున్నవారిలో వున్నారు. ఏలూరు పరిధిలోనే కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు కొందరు ఆసక్తిగా ఉండడం కాకుండా సామాజిక పరంగా బలమైన వ్యక్తులు కావడంతో ఎన్నికలలో వీరిని రంగంలోకి దింపే అవకాశాలున్నాయి. ఏలూరు లోక్‌సభ పరిధిలో సీనియర్ నేత జెట్టి గురునాథరావు, ఆయన సన్నిహితులు ఈ మధ్యనే పార్టీకి రాజీనామా చేశారు. వాస్తవానికి పార్టీ వ్యూహ రచనలోనూ, ముందుండి నడిపించడంలోనూ కీలకమైన గురునాథరావు పార్టీని వీడడం పెద్ద దెబ్బగానే భావిస్తున్నారు. ఆయనతో సంప్రదింపులు జరిపేందుకు సరైన నేతలను రాయబారులుగా పంపలేకపోయారు. అయినప్పటికీ ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాల పరిధిలోని 10 అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ తన అభ్యర్థులను రంగంలోకి దింపాలని ఇప్పటికే నిర్ణయించింది. వీలైనంత మేర కాస్తంత ఆర్థిక పరిపుష్టి వున్నవారినే కాకుండా వైసీపీ పక్షంలో అసంతృప్తికి గురై ఆ పార్టీకి దూరంగా వుంటున్న, ఓటర్లను ఆకర్షించగలి గిన వారిని రంగంలోకి దింపాలని యోచిస్తున్నారు. దెందులూరులో డీవీఆర్ చౌదరి పోటీకి సిద్ధపడాలని భావిస్తుండగా , ఇదే నియోజకవర్గం నుంచి ఆలపాటి నరసింహమూర్తి అభ్యర్థిత్వం పరిశీలనలోకి తీసుకున్నారు. బలమైన సామాజిక వర్గాలకు చెందిన వీరిద్దరిలో ఎవరిని రంగంలోకి దించినా సంతృప్తికర స్థాయిలో ఓట్లు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. ఏలూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌కు ఏలూరు నుంచి, పశ్చిమ గోదావరి జిల్లాలో పార్టీ అధ్యక్షుడు మారినీడి బాబ్జీకి తాడేపల్లిగూడెం నుంచి అవకాశం కల్పించబోతు న్నారు. నరసాపురం లోక్‌సభా స్థానం పరిధిలో ఆశావహుల సంఖ్య తక్కువగానే ఉండడంతో ఆచి తూచి వ్యవహరించ బోతున్నారు. ఎటుతిరిగి వామపక్షాలతో పార్టీ పొత్తుకు దిగబోతున్నందున ఆ దిశగా దృష్టి పెట్టారు.

వామపక్షాలు ఏం కోరుకుంటున్నాయి ?

కాంగ్రెస్‌తో పొత్తు కారణంగా ఏ ఏ సీట్లను కోరుకోవాలో ఇప్పటి నుంచే వామపక్షాలు మదింపు చేస్తున్నాయి. సీపీఎం సాధ్యమైనంత మేర నిలదొక్కుకోవాలని తాపత్రయపడుతోంది. గడచిన ఎన్నికల్లో ఉండి నుంచి పోటీ చేసిన ఆ పార్టీ అభ్యర్థి బి.బలరాంకు సంతృప్తకర స్థాయిలో ఓట్లు దక్కాయి. ఈసారీ అదే నియోజకవర్గాన్ని సీపీఎం పొత్తులో భాగంగా కోరుకునే అవకాశం ఉంది. జిల్లాల విభజన తర్వాత క్షేత్రస్థాయిలో పోరాటాలకు సీపీఎం ముందు వరుసలో వుంటూ రావడమేకాకుండా అనుబంధ సంఘాల బలం కూడా కలిసొచ్చినట్లయింది. ఈ మధ్యకాలంలో అంగన్‌వాడీ, ఆశా , ప్రభుత్వ ఉద్యోగుల ఆందోళనలో సీపీఎం అండగా నిలిచింది. దీంతోపాటే సీపీఐ తనవంతుగా ఎక్కడ అన్యాయం జరిగిందో అక్కడే వాలి ప్రజా పోరాటాలకు ఊతమిచ్చింది. వామపక్షా లు తాజాగా ఉండిని కోరుకుంటున్నాయి. పోలవరం స్థానంలోనూ ఇదే తరహా పోటీ కనిపిస్తోంది. పోలవరం నిర్వాసితుల సమస్యలపై ఒకవైపు సీపీఐ, వామపక్షాల అనుబంధ సంఘా లు ఈ నియోజకవర్గంలో కాస్తంత బలీయంగానే వున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ నియోజకవర్గం తమకు కేటాయించాలని కాంగ్రెస్‌ను కోరబోతున్నారు. ఏలూరు జిల్లా సీపీఐ కార్యదర్శి కృష్ణచైతన్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ దీనిపై దృష్టిపెట్టారు. పోలవరంతో పాటు ఒకటి రెండు స్థానాలను అటు సీపీఐ, ఇటు సీపీఎం కోరే అవకాశాలు స్పష్టంగా వున్నాయి. ఈ వారంలోపే దీనిపై స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. సీపీఎం పక్షాన పార్టీ కార్యదర్శి ఎ.రవి, బలరాంలు తాజా పరిస్థితిపై అధ్యయనం చేస్తున్నారు.



భీమవరంలో పోలియో చుక్కలు వేస్తున్న డీఎంహెచ్‌వో

రెండు చుక్కలతో చిన్నారులకు బంగారు జీవితం : కలెక్టర్

జిల్లాలో 97.64 శాతం పల్స్‌పోలియో

భీమవరం టౌన్, మార్చి 3 : చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలన్న ముఖ్య ఉద్దేశంతో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తారని జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ గాంధీ పేర్కొన్నారు. ఆదివారం ఆయన కలెక్టరేట్‌లో వివరాలు తెలిపారు. రెండు పోలియో చుక్కలు వల్ల పిల్లలకు బంగారు జీవితం అందించిన వారమవుతామని తెలి పారు. జిల్లాలో జీరో నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలు 1,85,953 మంది ఉన్నారని 1,81,565 మందికి (97.64 శాతం) ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమంలో చుక్కలు వేశారన్నారు. 20 మండలాలు, 6 పురపాలక సంఘం పరిధిలో అధి కారులు, సిబ్బంది పనిచేస్తున్నార న్నారు. జిల్లా వ్యాప్తంగా 181 రూట్లకు ఒక్కొక్క వాహ నాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం పోలియో చుక్కలు వేయని పిల్లలకు సోమవారం, మంగళవారం ఇంటింటికి వైద్య సిబ్బంది చుక్కలు వేస్తారని తెలిపారు. పోలియో రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరూ బాధ్య తగా పనిచేసి అర్హులైన పిల్లలకు 100% పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహె చ్‌వో డాక్టర్ మహేశ్వరరావు అన్నారు. పాలకోడేరులోని పల్స్ పోలియో బూత్‌ని ఆయన పరిశీలించారు.

నేడు ఎస్పీ స్పందన

భీమవరం క్రైం, మార్చి 3 : పోలీసు స్పందన కార్యక్ర మాన్ని భీమవరం పరిధి గొల్లలకోడేరు రోడ్డులో ఉన్న జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తారని ఎస్పీ కార్యాలయం ప్రకటనలో తెలిపింది. బాధితుల నుంచి జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఫిర్యాదులను స్వీకరి స్తారన్నారు.

సర్వే కుస్తీలు

ఎక్కడ..ఎవరికి సానుకూలం

సర్వే సంస్థలు జల్లెడ

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల విషయమై రాజకీయ పార్టీలు మల్లగుల్లాలు పడుతున్నాయి. సర్వేల్లో సానుకూలంగా ఉన్న అభ్యర్థులకు టిక్కెట్ ఖరారు చేసే విషయమై తర్జనభర్జనలు పడుతున్నాయి. వైసీపీ తొలి నుంచీ తాడేపల్లిగూడెం, ఉండి విషయంలో ఆలోచనలో పడింది. ఉండిలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పీవీఎల్‌కు అన్ని బాధ్యతలు అప్పగించింది. అయితే అక్కడ ప్రత్యామ్నాయం ఏమైనా ఉంటుందా అనే విషయంపై పావులు కదుపుతోంది. సర్వేలు నిర్వహిస్తోంది. ఇతర పార్టీల నుంచి నాయకులు వచ్చి నట్టయితే మార్పులు చేసేందుకు ఐప్యాక్ టీమ్ సర్వేను ఉపయోగించ నుంది. తెలుగుదేశం టిక్కెట్ సిట్టింగ్ ఎమ్మెల్యే రామరాజుకు ప్రకటించారు. ఇక్కడ టీడీపీలో కాస్త స్పర్థలు ఏర్పడ్డాయి. ముఖ్య నాయకుల మధ్య దూరం ఏర్పడింది. దానిని సరిదిద్దేందుకు పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఈ పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చు కోవాలని అధికార పార్టీ ఎత్తులు వేస్తున్నది. టీడీపీ అసంతృప్తి నాయకుని తమ పార్టీలో చేర్పించేందుకు పావులు




కదుపుతోంది. తాడేపల్లిగూడెంలోనూ ఐప్యాక్ టీమ్ దృష్టి పెట్టింది. వైసీపీ తరపున అభ్యర్థులపై ఆరా తీస్తోంది. మంత్రి కొట్టు సత్య నారాయణకు నియోజకవర్గంలో వ్యతిరేకత ఉందంటూ ఐప్యాక్ నివేదిక సమర్పించింది. ఇంటెలిజెన్స్ నివేదికలు అదే మాదిరిగా ఉన్నాయి. ఈ క్రమంలో ఓ మాజీ ఎమ్మెల్యేను రాబట్టేందుకు ప్రయత్నాలు చేసింది. గడచిన రెండు రోజుల నుంచి మంత్రి కొట్టుకే ఖరారవుతుందంటూ నియోజకవర్గంలో చర్చ సాగుతోంది. ఇంకా పూర్తి స్థాయిలో అధికార పార్టీలో స్పష్టత లేకుండా పోయింది. తెలుగు దేశం-జనసేన కూటమిలో ఉన్న ఆశావహుల పరిస్థితి ఎలా ఉంటుందంటూ ఆరా తీస్తోంది. తెలుగుదేశం నుంచి వలవల బాబ్జి, జనసేన నుంచి బొలిశెట్టి శ్రీనివాస్‌ల పేరుతో సర్వే నిర్వహించింది. ఐప్యాక్ బృందాలు ఆరా తీసి వైఎస్‌ఆర్ కాంగ్రెస్ అధిష్ఠానానికి నివేదిక ఇచ్చినట్టు సమాచారం. మరోవైపు తెలుగుదేశం కూటమి తరఫున గడచిన రెండు వారాలుగా నియోజకవర్గంలో అనుకూల, ప్రతికూల పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. కూటమి అధిష్ఠానాలకు నివేదికలు పంపుతున్నారు. నర్సాపురంలోనూ ఇదే పరిస్థితి. వాస్తవానికి జిల్లాలో తెలుగుదేశం నాలుగు నియోజకవర్గాల్లో పోటీ చేయనున్నట్టు ప్రకటించింది. భీమవరం, తాడేపల్లి గూడెం, నర్సాపురం నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. అందుకోసం తుది దశ సర్వేలను చేపడుతున్నారు. భీమవరంలో పవన్ కల్యాణ్ పోటీ చేస్తారని అంతా భావించారు. ఇప్పుడు పిఠాపురం తెరపైకి వచ్చింది. దాంతో అంజిబాబుకు అక్కడ జనసేన తరఫున ఛాన్స్ ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆ దిశగానూ సర్వే బృందాలు ఆరా తీస్తున్నాయి. ఎంపీ విషయానికొచ్చేసరికి తెలుగుదేశం కూటమికి ఏకైక అభ్యర్థిగా రఘురామకృష్ణంరాజు పేరుతోనే ఐవీఆర్ సర్వే నిర్వహించారు. ఇలా సర్వేలను బేరీజు వేసుకుంటూ అభ్యర్థులను ఖరారు చేయడానికి అన్ని పార్టీలు కుస్తీ పడుతున్నాయి.



చల్లగా.. హాయిగా

ఎండలు పెరుగుతున్నాయి. ఉక్కపోత ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. కాస్తంత చల్లదనం కోసం చిన్నారులు కాల్వ బాట పట్టారు. ఆదివారం పాఠశాలలకు సెలవు రావ డంతో సైకిళ్లు వేసుకుని పంట కాల్వల వద్దకు చేరుకు న్నారు. గట్లపైనుంచి కాలువలోకి దూకుతూ విన్యాసాలు చేశారు. కేరింతల కొడుతూ జలకాలాడారు. చల్లటి నీటిలో వేసవి తాపం నుంచి ఉపశమనం పొందారు. పెనుమంట్ర మండలం వెలగలవారిపాలెం పంట కాలువలో కనిపించిన సందడి ఇది.. -పెనుమంట్ర

శివరాత్రి ఉత్సవాలకు పట్టిసీమ ముస్తాబు
7



క్రీడలతో మానసికోల్లాసం: బొలిశెట్టి



మాట్లాడుతున్న బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 3: క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని కలిగిస్తాయని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బొలిశెట్టి తనయుడు రాజేష్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ప్రథమ బహుమతి రూ. 30 వేలు, రెండో బహుమతి రూ. 20 వేలు, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌కు రూ. 6 వేలు బొలిశెట్టి శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు తప్పనిసరిగా ఆడాలన్నారు. నిర్వాహకుడు బొలిశెట్టి రాజేష్‌ను అభినందించారు. జనసేన నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ వారోత్సవాలు



ప్రతిజ్ఞ చేస్తున్న తల్లులు, కిశోర బాలికలు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 3: మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా తాడేపల్లిగూడెం శ్రీదేవి పుంతలో కిశోర బాలికలు, తల్లులతో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్. దుర్గాభవాని బాల్యవివాహాలు చేయనివ్వమని, బాలికలకు చదువు చెప్పిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అంగన్వాడీ కార్యకర్తలు గాయత్రి, లక్ష్మి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను పెంచాలి

అత్తిలి, మార్చి 3 : మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను పెంచినప్పుడే మహిళల ఆర్థిక స్వావలంబన సాధ్యమని ఐసీడీఎస్ తిరుపతిపురం సెక్టార్ పర్యవేక్షకురాలు ఎం.శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల సందర్భంగా తిరుపతిపురం, గుమ్మంపాడు, బల్లిపాడు, యర్రనీలిగుంట గ్రామాల్లో ర్యాలీలు, మానవహారాన్ని నిర్వహించారు. మహిళల హక్కులపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పూలవర్తి గిరిజ, బి.రాజకుమారి, జి. లక్ష్మీకుమారి, ఎం.శివసత్యవతి, జి.శిరీష, వీరలక్ష్మి, బి.స్వరూపరాణి పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ హుస్సేన్

తణుకు, మార్చి 3:సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా కదల్లేని వృద్ధుల ఇళ్లకే వెళ్ళి సంచార శకటం ద్వారా అందించే వైద్య సేవలను ఆదివారం డా. హుస్సేన్ అహ్మద్ అందించారు. తణుకు, సజ్జాపురం ప్రాంతాల్లో పర్యటించి 9 మందికి సేవలందించారు. సంఘ సభ్యులు పాతూరి శివన్నారాయణ ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. కోశాధికారి అర్ధి భాస్కరరావు,సభ్యులు పాల్గొన్నారు.

నియంత పాలన అంతమొందించాలి : సీపీఎం



దుంపగడపలో సీపీఎం నాయకుల ప్రచారం

ఆకివీడురూరల్, మార్చి 3 : రాష్ట్రంలో సాగుతున్న నియంత పాలనను అంతమొందించాలని సీపీఎం నాయకులు అన్నారు. ఆదివారం దుంపగడపలో సీపీఎం నాయకులు రాజకీయ ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి సహకరిస్తున్న పార్టీలను గద్దె దించాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని ప్రజా సమస్యలను పరిష్కరించకుండా నియంతపాలన సాగిస్తున్నారన్నారు. ప్రజలపై విపరీతమైన భారాలు మోపి రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. బీజేపీ పాలనకు వ్యతిరేకంగా కరపత్రాలు పంపిణీ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, పెంకి అప్పారావు, ఎస్‌కే వలీ, బి.రాంబాబు, డి.రవితేజ కె.శంకర్, ఎస్.సూరిబాబు, ఎస్.ఉదయ్‌కుమారి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'సర్పంచ్ సేవలు అభినందనీయం'



ఇంటిని ప్రారంభించిన సర్పంచ్, మాజీ ఎంపీపీ

కాళ్ళ, మార్చి 3 : తనను గెలిపించిన గ్రామ ప్రజలకు సేవలందించడంతో పాటు నిలువ నీడలేని నిరుపేద కుటుంబానికి సొంత నిధులతో ఇంటిని నిర్మించి ఆదుకున్న సర్పంచ్ సుబ్బారావు అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారని మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్నప్రసాద్ అన్నారు. దొడ్డనపూడిలో సర్పంచ్ కొల్లి సుబ్బారావు భాస్విని చారిటబుల్ ట్రస్టు ద్వారా నిర్మించిన నూతన ఇంటిని ఆదివారం సర్పంచ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన నడుపూరి దుర్గారావు తన తండ్రి చనిపోవడంతో తల్లి సరోజినితో కలిసి శిథిలావస్థకు చేరిన తాటాకు ఇంట్లో నివశిస్తుండడంతో ట్రస్టు ద్వారా సుమారు రూ.4.15 లక్షలతో ఇల్లు నిర్మించడంతో పాటు కరెంటు వసతి కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మాజీ ఎంపీటీసీ కందులపాటి వీరరాఘవులు, దేశంశెట్టి మధుసూదనరావు, ఆరేటి కృష్ణ, కొల్లి శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

టెలిఫోన్ రూపకర్త గ్రహంబెల్ జయంతి

భీమవరంటౌన్, మార్చి 3 : శ్రీవిజ్ఞాన వేదిక, జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు టెలిఫోన్ రూపకర్త అలెగ్జాండర్ గ్రహంబెల్ జయంతి కార్యక్రమాన్ని స్థానిక క్విట్ ఇండియా స్తూపం వద్ద ఆదివారం నిర్వహించారు. ఆర్ఆర్ డీఎస్ కళాశాల ప్రొఫెసర్ పి.అమూల్యరావు, న్యాయవాది ఉండపల్లి రమేష్‌నాయుడు మాట్లాడుతూ ఆధునిక యుగంలో సెల్‌ఫోన్ మానవుడికి వాడుకలో ఒక భాగం అయిందన్నారు. సెల్‌ఫోన్ లేని మనిషి లేడని, గ్రహంబెల్ టెలిఫోన్ పరిశోధన అనంతరం ఈ టెక్నాలజీ మనుగడలోకి వచ్చిందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాటాడుతూ అత్యంత పరిజ్ఞానం ఉన్న ఇంజనీర్‌గా గ్రహంబెల్ స్ఫూర్తిదాయకులన్నారు. ఆలిండియా పార్వర్డు బ్లాక్ సభ్యులు దండు శ్రీనివాసరాజు, ఎస్‌కే చాన్‌బాషా, భట్టిప్రోలు శ్రీనివాసరావు, చల్లా రాము పాల్గొన్నారు.

ఈ-క్రాప్ జాబితా సరిచూసుకోవాలి

మొగల్తూరు, మార్చి 3 : పంట నమోదు చేయించుకున్న రైతులు రైతు భరోసా కేంద్రాల్లో ప్రకటించిన ఈ-క్రాప్ జాబితాను సరిచూసుకోవాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాగు చేస్తున్న రైతుల పేర్లు, సాగు విస్తీర్ణం, పంట వివరాలను ఆర్‌బీకేల్లోని నోటీస్ బోర్డులో ఉంచామని, రైతులు పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే ఈనెల 5వ తేదీగా తెలియపర్చాలన్నారు. దాళ్వా ధాన్యం విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు పడకుండా రైతులు జాగ్రత్తపడాలని కోరారు.

అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు

పెనుగొండ, మార్చి3: పెనుగొండ మండలంలో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్‌తో కలిసి మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజు ఆదివారం పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. దొంగరావిపాలెం, సిద్ధాంతం శివారు నక్కవారిపాలెం, చినమల్లం, సోమరాజు చెరువు, పెనుగొండలో గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌లు, పంచాయతీ భవనం, సిద్ధాంతం పెదపేటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పోదూరి గోవర్ధన, సర్పంచ్ నక్కా శ్యామలాసోని, ఉపసర్పంచ్ వరలక్ష్మి, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వాడ అన్నవరంలో..

భీమవరం రూరల్, మార్చి 3 : కొవ్వాడ అన్నవరం గ్రామంలో సుమారు రూ.రెండు కోట్లతో జరిగిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం పలు సీసీ రోడ్లను ప్రారంభించారు.



ఉండిలో ఎమ్మెల్యే రామరాజు, ఆకివీడులో నగర పంచాయతీ చైర్మన్ హైమావతి, పాలకొల్లులో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, గణపవరంలో ఎంపీపీ దండు రాము పోలియో చుక్కలు వేస్తున్న దృశ్యాలు

పోలియో రహిత సమాజానికి కృషి చేద్దాం

డీఎంహెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు

● పాలకోడేరు/ఉండి/ ఆకివీడు/ ఆకివీడు రూరల్/ కాళ్ల, మార్చి 3: పోలియో రహిత సమాజం కోసం కృషి చేద్దామని, వంద శాతం పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు తెలిపారు. పాలకోడేరులోని పల్స్‌పోలియో బూత్‌ని ఆయనతో పాటు డీఐవో దేవ సుధాలక్ష్మి, జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ భావన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాలకోడేరు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న కార్యక్రమాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రంగం నాయుడు, డాక్టర్ స్వర్ణనిరంజని, డాక్టర్ లీలాలక్ష్మి, సీహెచ్‌వో సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. ఉండి మండలం ఉండి పీహెచ్‌సీలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు ప్రారంభించారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, యండగండి సర్పంచ్ చిన్నకృష్ణమూర్తి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆకివీడు నగర పంచాయతీ కార్యాలయం, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చిన్నారులకు పోలియో చుక్కలను నగర పంచాయతీ చైర్మన్ జామి హైమావతి వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. భీమవరం ఎన్నికల పరిశీలకులు మోటుపల్లి గంగాధరరావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు, యూపీహెచ్‌సీ వైద్యుడు వెంకటపతిరాజు తదితరులు ఉన్నారు. ఆకివీడు రూరల్ పెదకాపవరం పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 3,434 మంది పిల్లలకు 34 బూత్‌లు, మూడు టీమ్స్, ఒక మొబైల్ టీమ్ ద్వారా 3,350 మందికి చుక్కలు వేశామని వైద్య అధికారులు తెలిపారు. కాళ్ల మండలం కాళ్ల ప్రభుత్వాసుపత్రిలో చిన్నారులకు పోలియో చుక్కలను వేసి కార్యక్రమాన్ని జడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు ప్రారంభించారు. డాక్టర్ ఎస్.సునీల్ మాట్లాడుతూ మండలంలో 43 బూత్‌లద్వారా 7,076 మంది పిల్లలకు 6867 మందికి చుక్కలు వేశామన్నారు.

● పాలకొల్లు టౌన్/రూరల్, మార్చి 3 : పోలియో నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ కోరారు. ఆదివారం పాలకొల్లు ఎల్ఆర్‌పేటలోని పల్స్‌పోలియో శిబిరంలో వైద్య సిబ్బందితో కలిసి ఆయన చిన్నారులకు చుక్కలు వేశారు. పాలకొల్లు మండలం బల్లిపాడులో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. లంకలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారులు అడ్డాల ప్రతాప్‌కుమార్, నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు పాల్గొన్నారు.

● భీమవరం రూరల్/వీరవాసరం, మార్చి 3:పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం 24వ వార్డులోని యూపీహెచ్‌సీ స్కూల్‌లో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చిన్నారులకు పోలియోచుక్కలు వేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ తల్లి కూడా తమ బిడ్డలకు పోలియో చుక్కలు వేయించుకోవాలన్నారు. వీరవాసరం మండలంలో వీరవాసరం పీహెచ్‌సీలో ఆదివారం ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని ప్రారంభించారు. వీరవాసరం పీహెచ్‌సీ పరిధిలో 5,195 మందికి 4,935 మందికి చుక్కలు వేశారు. మిగిలిన పిల్లలకు సోమ, మంగళవారాలు ఇంటింటా సర్వే నిర్వహించి లక్ష్యాలను పూర్తిచేస్తామని వైద్యాధికారులు తెలిపారు. డాక్టర్ ఎస్.మోహాసినాతాజ్, డాక్టర్ హర్షిత, సీహెచ్‌వో ఎ.దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

● నరసాపురం టౌన్/మొగల్తూరు, మార్చి3 : పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని కొప్పర్తి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆయన ప్రారంభించి, చిన్నారులకు చుక్కల మందు వేశారు. చైర్‌పర్సన్ వెంకటరమణ, కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, సత్యవతి, ఠాగూర్, కావలి నాని తదితరులు పాల్గొన్నారు. మొగల్తూరు మండలంలో 97 శాతం పల్స్ పోలియో చుక్కలు వేశామని వైద్యాధికారి దినేష్ తెలిపారు. మండలంలో 5,531 మంది చిన్నారులకు 5,397 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. మండలంలో 53 బూత్‌లు, ఒక మొబైల్ టీమ్, ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఆలయం వద్ద ఒక ట్రాన్సిట్ టీమ్ ద్వారా చిన్నారులకు చుక్కలు వేశామన్నారు.

● ఆచంట/పెనుగొండ/పోడూరు, మార్చి3 : ఆచంట మండలం వల్లూరు వేమవరం పీహెచ్‌సీలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి ప్రారంభించారు. మండలంలో 94శాతంపైనే చిన్నారులకు పోలియో చుక్కలు వేశామని వైద్యాధికారులు తెలిపారు. పెనుగొండ మండలం పెనుగొండలో సర్పంచ్ నక్కా శ్యామలా సోని వైదాయధికారులతో కలిసి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. స్థానిక పంచాయతీ,బస్టాండ్, గ్రామ కచేరి, వేండ్రవారి వీధి, జడ్పీ హైస్కూలు, రామచంద్రరావు పేట, రాజుగూడెంలలో సెంటర్లలో పోలియో చుక్కలు వేశారు. పోడూరు మండలంలో 3,654 మంది చిన్నారులకు గాను 3,507 మందికి చుక్కలు వేశారు. 96 శాతం మందికి పోలియో చుక్కలు వేశామని పోడూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి మణిత్యాగి తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి వి.సత్యనారాయణ, వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

● గణపవరం, మార్చి 3: చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసి పోలియో మహమ్మారిని తరిమి కొట్టాలని ఎంపీపీ దండు వెంకటరామరాజు అన్నారు. అర్థవరంలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గణపవరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, మండల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి, వైద్యాధికారులు సంతోష్‌నాయుడు, కిరణ్మయి, కె.ప్రియాంక పాల్గొన్నారు.

● తణుకు/అత్తిలి, మార్చి 3: తణుకు పట్టణ పరిధిలో పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం 94.6 శాతం పూర్తయినట్టు నోడల్ అధికారి డాక్టర్ బి.దుర్గామహేశ్వరరావు చెప్పారు. మున్సిపల్ పరిధిలో 52 పోలియో చుక్కల పంపిణీ కేంద్రాల ద్వారా 6,712 మంది చిన్నారులకు రైల్వే స్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లో 32 మందికి, మూడు మొబైల్ టీమ్స్ ద్వారా 41 మంది చిన్నారులకు చుక్కలు వేశామన్నారు. అత్తిలి మండలం ఆరవల్లి డ్వాక్రా భవనంలో పోలియో చుక్కల శిబిరాన్ని గ్రామ ఉప సర్పంచ్ వెలగల అమ్మిరెడ్డి ప్రారంభించారు. అసిస్టెంట్ స్వామి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉండ్రాజవరపు రాణి, టి.వరలక్ష్మి పాల్గొన్నారు.

● తాడేపల్లిగూడెం రూరల్/పెంటపాడు : తాడేపల్లిగూడెం మండలంలోని మాధవరం, వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీల పరిధిలో 31 గ్రామాల్లో 7,967 మంది చిన్నారుల కు పోలియో చుక్కలు వేశారు. మాధవరం పీహెచ్‌సీలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాధవరం పీహెచ్‌సీ పరిధిలో 3827 మంది లక్ష్యం కాగా 3674 మంది చిన్నారులకు చుక్కలు వేసినట్టు వైద్యులు వెంకటేష్ తెలిపారు. వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ పరిధిలో 4523 మందికి గాను 4293 మందికి పోలియో చుక్కలు వేసినట్టు వైద్యుడు ఎస్. శ్రీహర్ష వివరించారు. పెంటపాడు మండలం పెంటపాడు పీహెచ్‌సీ పరిధిలో 95 శాతం, ముదునూరు పీహెచ్‌సీ పరిధిలో 92 శాతం పోలియో చుక్కలను వేసినట్లు ఆయా పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ తోట రాజేష్‌కుమార్, డాక్టర్ పూజిత తెలిపారు. సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఉప సర్పంచ్ కొప్పూరి ప్రసాద్‌రెడ్డి, వార్డు సభ్యుడు మారంపూడి ఏసుదాసు, ఎంపీటీసీ రెడ్డి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో..



చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న క్లబ్ అధ్యక్షుడు పెనుమాక రామ్మోహన్‌రావు

పాలకొల్లు : పాలకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని 31 శిబిరాల్లో నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు పెనుమాక రామ్మోహన్‌రావు, క్లబ్ సెక్రటరీ రావాడ సతీష్, పాస్ట్ ప్రెసిడెంట్ చందక రాము, తదితరులు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. దాత కెవి.కృష్ణవర్మ ఆర్థిక సాయంతో 31 పల్స్‌పోలియో శిబిరాల్లోని 150మంది సిబ్బందికి భోజనం ప్యాకెట్లను అందచేశారు. మద్దాల వాసు, కావలి నగేష్, ముత్యాల శ్రీనివాస్, పోతాబత్తుల సత్యనారాయణ, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో డిప్యూటీ సీఎం కొట్టు, పెనుగొండలో సర్పంచ్ శ్యామలా సోని, వీరవాసరంలో ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని పోలియో చుక్కలు వేస్తున్న దృశ్యాలు



పాలకొల్లులో నిమ్మలకు యూటీఎఫ్ నాయకుల వినతి, తాడేపల్లిగూడెంలో సూపర్ సిక్స్ మెటీరియల్ అందజేస్తున్న బాబ్జి, ఇరగవరంలో ఆరిమిల్లికి స్వాగతం

జగన్ అధికారంలోకి వస్తే ప్రజల ఆస్తులు తాకట్టే : నిమ్మల

పాలకొల్లు టౌన్, మార్చి 3 : రాష్ట్రంలోని సచివాలయాన్ని రూ.370 కోట్లకు తాకట్టు పెట్టిన ముఖ్యమంత్రి జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజల ఆస్తులను తాకట్టు పెడతాడని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు విమర్శించారు. యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు ఆదివారం ఆయనను కలిసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరణ అమలు చేయాలని టీడీపీ, జనసేన కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని కోరుతూ ఎమ్మెల్యే నిమ్మలకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే నిమ్మల మాట్లాడుతూ రాబోయే కూటమి ప్రభుత్వంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అన్ని రకాలుగా మేలు జరగడంతో పాటు పాత పెన్షన్ విధానం అమలు జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పథకాలు ప్రజలకు చేరువ చేయండి : వలవల

తాడేపల్లిగూడెం అర్బన్ : టీడీపీ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళి పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి పార్టీ శ్రేణులకు సూచించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలతో సమావేశాన్ని పట్టణ అధ్యక్షుడు పట్నాల రాంపండు అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలనానరు. టిక్కెట్ విషయంలో పార్టీ కార్యకర్తలెవ్వరూ ఆందోళన చెందవద్దన్నారు. పార్టీ శేణుల మనోభావాలను తాను ఎప్పటికప్పుడు పార్టీ అధ్యక్షులకు చెబుతున్నానన్నారు. అనంతరం సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన మెటీరియల్‌ను నాయకులకు అందజేశారు. పోతుల అన్నవరం, కిలపర్తి వెంకట్రావు, పరిమి రవికుమార్, వాడపల్లి సుబ్బరాజు, రాంలక్ష్మణ్‌తదితరులు పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీలను అణగదొక్కిన వైసీపీ: ఆరిమిల్లి

ఇరగవరం, మార్చి 3 : బీసీలు, ఎస్సీలను అణగదొక్కిన ఘనత వైసీపీ ప్రభుత్వానికి దక్కుతుందని తణుకు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ ఆరోపించారు. సకల జనుల చైతన్య యాత్రలో భాగంగా మండలంలోని కత్తవపాడు, ఇరగవరం, అర్జునుడుపాలెం గ్రామాల్లో ఆదివారం పాదయాత్ర చేశారు. గ్రామాల్లో దారిపొడవునా టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు ఆయనను పూలమాలలతో సత్కరించి ఘనస్వాగతం పలికారు. ఆదివారం కావడంతో చర్చిల వద్ద క్రైస్తవులను ఆయన పలకరించగా పాస్టర్లు ఆరిమిల్లి అత్యధిక మెజార్టీతో గెలుపొందాలని ప్రార్థనలు చేశారు. కత్తవపాడులో డ్రైనేజీ సమస్య వేధిస్తోందని, గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాలు కట్టించాలని స్థానికులు కోరగా రాధాకృష్ణ సానుకూలంగా స్పందించారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దొమ్మేటి వెంకటసుధాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు బసవ రామకృష్ణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుక్కా సాయిబాబు, మండల కార్యదర్శి బొంతు శ్రీను, డి.గణపతి రాజు, కారం బాబూరావు, వేండ్ర నాగరాజేశ్వరరావు, వేండ్ర జనార్ధన్, ఏలూరు వెంకటేశ్వరరావు, చవ్వాకుల సత్యనారాయణ, మల్లుల శ్రీనివాసరావు, తానేటి సుబ్రమణ్యం, వేండ్ర పోతురాజు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో పేదలకు భరోసా : రవికుమార్

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 3:అవినీతి పాలనతో రాష్ట్రం అధోగతి పాలైందని చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు పేదల భవిష్యత్‌కు భరోసా ఇస్తాయని టీడీపీ మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్ పేర్కొన్నారు. చినతాడేపల్లిలో సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ఆదివారం గ్రామస్థులకు అందించారు. మాజీ సర్పంచ్ చిటకన శ్రీనివాస్, నాయకులు ఎన్. రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

ఘనంగా గరగలమ్మ జాతర



పోడూరు, మార్చి 3 : పోడూరు గ్రామదేవత గరగలమ్మ అమ్మవారి జాతర ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. అమ్మవార్ల ఘటాలతో ఆశాదులు నిర్వహించిన నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బుట్టబొమ్మలు, కోయడ్యాన్స్‌లు, కాళికామాత వేషధారణలు, తీన్‌మార్ డప్పులతో బాణసంచా కాల్పులతో జాతర నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సీతారామరాజు, సొసైటీ చైర్మన్ రుద్రరాజు శివాజీరాజు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ముత్యాలమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

మొగల్తూరు, మార్చి 3 : ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మన ప్రాంతంతో పాటు సరిహద్దు జిల్లాలైన కృష్ణా, తూర్పు గోదావరి జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు కావాల్సిన సదుపాయాలను ఆలయ కమిటీ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, పాలకవర్గ సభ్యులు, ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

జుత్తిగలో సూర్యనారాయణమూర్తికి అభిషేకాలు



పెనుమంట్ర, మార్చి 3 : మాఘమాసం ఆదివారాన్ని పురస్కరించుకుని జుత్తిగలోని ఉమావాసుకి రవి సోమేశ్వరస్వామి ఆలయంలో ఉపాలయంగా ఉన్న సూర్యనారాయణమూర్తికి ఆఖరి ఆదివారం అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు రామకృష్ణ శర్మ, వాసు శర్మ ఆధ్వర్యంలో పంచామృతాలు, పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అష్టమి తిథి సందర్భంగా కాలభైరవ స్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు.



చెరుకువాడలో వేణుగోపాలస్వామి ఆలయం (ఇన్‌సెట్‌లో) విగ్రహానికి పూజలు

వేణుగోపాలస్వామి ఆలయంలో విగ్రహాల పునఃప్రతిష్ఠ

ఉండి, మార్చి 3:చెరుకువాడలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉండి ఎమ్మెల్యే రామరాజు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, సర్పంచ్ కొండవీటి సాంబశివరావు స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు.ఆలయంలో మహాశాంతి హోమాలు, శాంతి కల్యాణం, నీరాజన మంత్రపుష్పముల కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన జరిగింది. నడింపల్లి కృష్ణంరాజు, కొండవీటి సూర్యనారాయణ, ఎస్.బాబు, ఎస్.నరసింహమూర్తి, పి.విజయ, కె.సత్తిబాబు, కె. సత్యనారాయణ, యర్రింకి బుజ్జి, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మాచేనమ్మకు భక్తుల పూజలు

ఆచంట, మార్చి3 : పెదమల్లం మాచేనమ్మ ఆలయానికి భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ అధికారి, కమిటీ సభ్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

భారత రాజ్యాంగాన్ని సమష్టిగా రక్షించుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

భీమవరం మార్చి3 : భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి దళితులందరూ సమష్టిగా పోరాటం చేయాలని పలువురు దళిత సంఘాల, షెడ్యూల్ కులాల నాయకులు పిలుపునిచ్చారు. 'భారత రాజ్యాంగాన్ని రక్షించుకుందాం, ప్రజా స్వామ్యాన్ని కాపాడు కుందాం' అనే అంశంపై ఆదివారం సాయంత్రం స్థానిక 11వ వార్డు రాజ్ ట్రస్టు కార్యాలయంలో దళిత సంఘాల ఆధ్వరంలో దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ ఆధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పలువురు దళిత నాయకులు మాట్లాడుతూ రిజర్వేషన్ల పరిరక్షణకై దళితులంతా ఐక్య పోరాటాలు చేయాలని సమావేశం తీర్మానించిందన్నారు. దళిత నాయకులు వెంకటరత్నం, కోరం ముసలయ్య, సోడదాసి గంగయ్య, కొప్రపాటి అనిత, బందెల. ప్రమీలరాజం, చవ్వాకుల భరత్, జక్కుల విజయకుమార్, గొల్ల విజయ్‌కుమార్, పట్టెం ప్రభాకర్‌తదితరులు పాల్గొన్నారు.

రేపు జయహో బీసీ సభ జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న టీడీపీ అగ్నికుల క్షత్రియ రాష్ట్ర కన్వీనర్ రవి

నరసాపురం, మార్చి 3 : బీసీలకు రాజకీయంగా గుర్తింపు నిచ్చిన ఘనత టీడీపీకే దక్కుతుందని పార్టీ రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కన్వీనర్ కొప్పాడ రవీంద్ర అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ బీసీ నాయకులతో ఈనెల 5న మంగళగిరిలో జరిగే జయహో బీసీ సభపై చర్చించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ బీసీలకు చేసిందేమీ లేదన్నారు. టీడీపీ అధ్వర్యంలో జరిగే జయహో సభకు నియోజకవర్గం నుంచి అత్యధిక సంఖ్యలో బీసీలు తరలివెళ్లేలా ప్రణాళిక చేస్తున్నామన్నారు. గుబ్బల నాగరాజు, వాతాడి ఉమా, మల్లాడి మూర్తి, మామిడిశెట్టి సత్యనారాయణ, బోరా చిన్నాయమ్మ, జి.సునీత, పంపన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాలయోగి ఆశయాలు స్ఫూర్తిదాయకం

గణపవరం, మార్చి 3: దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమని టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, ఉంగుటూరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు అన్నారు. జీఎంసీ బాలయోగి 22వ వర్థంతి సందర్భంగా పిప్పర మండల టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యాళ్ళ సుబ్బారావు, కొప్పిశెట్టి ఏసుబాబు, అల్లూరి బదిరి నారాయణ, కానుమిల్లి చంటి, కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, కాపారం చిన్న పాల్గొన్నారు.

పేదలకు బట్టల పంపిణీ



నరసాపురం టౌన్, మార్చి 3: పేదలకు సేవ చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని చైర్‌పర్సన్ బర్రె వెంకటరమణ అన్నారు. ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్టీమర్‌రోడ్డులో పేదలకు బట్టలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. క్లబ్ అధ్వర్యంలో తీర గ్రామాల్లో మరిన్ని మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. క్లబ్ అధ్యక్షురాలు గన్నాబత్తుల సత్యవతి మాట్లాడుతూ ఈ ఏడాది మరిన్ని మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. క్లబ్ సభ్యులు సూర్యకుమారి, కోట్ల రామ్‌కుమార్, భవానీవిజయ్, బ్రహ్మాజీ, పాల్గొన్నారు.

భూ పంపిణీ ఎన్నికల మాయాజాలం


బాబ్జి

- గతంలో చెల్లని ఆధారాలు ఇప్పుడు ఎలా చెల్లాయి
- అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో నిబంధనలు బేఖాతరు
- ప్రకాశం ల్యాండ్ లెస్ పూర్ సొసైటీ అధ్యక్షుడు బాబ్జి

మొగల్తూరు,మార్చి 3: వైసీపీ ప్రభుత్వం చేపట్టిన కాళీపట్నం భూ పంపిణీ కార్యక్రమం ఎన్నికల మాయాజాలమని ప్రకాశం ల్యాండ్ లెస్ పూర్ సొసైటీ అధ్యక్షుడు మేడిద మాధవ కృష్ణారావు (బాబ్జి) ఆరోపించారు. ఆదివారం మొగల్తూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాళీపట్నం రెవెన్యూ పరిధిలో గల భూమి అంతా జమిందార్‌గా చెప్పుకున్న కాండ్రేకుల సదాశివరామకృష్ణారావుకు సంబంధం లేదంటూ నరసాపురం కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకూ తీర్పులు వచ్చాయన్నారు. దీంతో ఈ కేసును 1969లో విజయవాడ ట్రిబ్యునల్‌కు సుప్రీం కోర్టు పంపిందన్నారు. ఈ భూములపై అప్పటి ప్రభుత్వం వేసిన నాన్ అఫీషియల్ కమిటీ విచారణ చేసి ప్రభుత్వ భూమిగా ధృవీకరించిందన్నారు. విజయవాడ ట్రిబ్యునల్ కోర్టు ఆదేశాలతో 1978 నుండి 82 వరకూ విచారణ చేసి భూమిపై సాగు రైతులకు హక్కులు లేవని సెటిల్‌మెంట్ కోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. 1973లో ఇవి ప్రభుత్వ భూములని సెటిల్‌మెంట్ అధికారులు గ్రామంలో టాంటాం వేయించారన్నారు. 1947కు భూమిపై రైతుల హక్కు పత్రాలు 1978 నుండి 82 వరకూ సెటిల్‌మెంట్ కమిషనర్, నరసాపురం సబ్ కలెక్టర్‌లు చేసిన విచారణలో రైతుల హక్కులు చెల్లవని తీర్పు ఇచ్చారన్నారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 7 ప్రకారం 1947కు భూమిపై సాగు చేసుకునే వారికి గల హక్కులు విచారించి పట్టాలు ఇవ్వాల్సి ఉందని తెలియ జేశారు. నాటి విచారణలో లేని ఆధారాలు ఇప్పుడెలా చెల్లుబాటు అయ్యాయని ఆయన ప్రశ్నించారు. కేవలం ఎన్నికల్లో ఓట్లు కోసమే అధికార పార్టీ కాళీపట్నం భూ సమస్య పరిష్కారం చేసినట్టు ఆధారాలు సక్రమంగా లేకన్నా పది మంది కి పట్టాలిచ్చారన్నారు. అధికారులు సయితం అధికార పార్టీ వత్తిడికి లోనయి నిబంధనలు తుంగలో తొక్కి వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. తాము చట్టపరంగా అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై పోరాడతామన్నారు. ఎన్నికల కోసం అధికార పార్టీ కాళీపట్నం ప్రజలను మభ్యపెడితే సహించేది లేదన్నారు.

పట్టిసీమ ముస్తాబు

మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అధికారులు ముమ్మర ఏర్పాట్లను చేస్తున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని, ఆలయ అధికారులు చెబుతున్నారు.


పట్టిసీమలో గోదావరిపై పంట్లతో నిర్మిస్తున్న వంతెన

పోలవరం, మార్చి 3 : పట్టిసీమ మహా శివరాత్రి ఉత్సవాలు ఈ నెల 7 నుంచి పారంభం కానున్న నేపథ్యంలో ఉత్సవ ఏర్పాట్లను ఆలయ అధికారులు, ఫెర్రీ కాంట్రాక్టర్లు వేగవంతం చేశారు. గోదావరి నదిపై భక్తుల రాకపోకలకు అవతలి వైపున కర్రలు, వెదురు తడికలతో కాలిబాట ఏర్పాటు చేశారు. స్నానాల రేవులకు బారికేడ్‌లు, బట్టలు మార్చుకునే గదులు, ఇసుక తిన్నెల్లో చలువ పందిళ్ల ఏర్పాటు చేశారు. కన్నాపురం అడ్డ రోడ్డు నుంచి రహదారి మరమ్మతులు నేషనల్ హైవే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తూతూ మంత్రంగా జరుగుతున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రహదారి మార్జిన్లకు బెర్మ్‌లు లేవని, అధికారులు గత సమీక్షలో మూడో తేదీకి పూర్తి చేస్తామని చెప్పిన తీరులో క్షేత్రస్థాయిలో పనులు జరగలేదు. దీంతో ఈ రహదారిలో పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాలలో వాహనాలు తప్పుకోవడాని కి మార్గం లేక ఇబ్బందులు తప్పవని పలువురు అభిప్రాయపడుతున్నారు.

యువ మోర్చ ఏపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా అరసవల్లి మణికంఠ



భీమవరంటౌన్, మార్చి 3 : భారతీయ జనతా పార్టీ విభాగం యువ మోర్చ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా భీమవరానికి చెందిన అరసవల్లి మణికంఠ వెంకటేష్‌ని నియమించారు. ఈయన గతంలో పట్టణ యువ మోర్చా అధ్యక్షుడిగా, జిల్లా యువమోర్చా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. దీంతో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణ నూతన కమిటీలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. మణికంఠ ఎన్నికపై జిల్లా యువ మోర్చా నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు. అరసవల్లి మణికంఠ వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించినందుకు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, మధుకర్, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం కన్వీనర్ పాక వెంకట సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, పూర్వ బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఆకుల లీల కృష్ణమూర్తి, భారతీయ జన తా జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

అంబేడ్కర్ విగ్రహం తరలింపు.. మరోచోట ప్రతిష్ట



మండవల్లి, మార్చి 3: మండవల్లి ప్రధాన సెంటర్‌లో 33 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని మరో చోటకు ఆదివారం మార్చారు. 165 జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా అంబేడ్కర్ విగ్రహాన్ని అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్దకు మార్చారు. తీన్‌మార్ డప్పుల వాయిద్యాలతో జైభీమ్ నినాదాల మధ్య విగ్రహాన్ని క్రేన్ మార్చారు. అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శాంతరాజు, సీహెచ్ విజయ్, గౌరవ అధ్యక్షుడు ఎల్.ఎస్. భాస్కరరావు, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్రికెట్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన

నూజివీడు టౌన్, మార్చి 3: నూజివీడు క్రికెట్ స్టేడియం నిర్మాణానికి నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదివారం శంకుస్థాపన చేశారు. నూజివీడు గురుకుల పాఠశాల సమీపంలోని క్రీడా ప్రాంగణంలో నిర్మించతలపెట్టిన క్రికెట్ స్టేడియంకు ఆయన శంకుస్థాపన చేశారు. ఎంపీ ల్యాడ్స్ నిధులతో క్రీడాప్రాంగణాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

చాట్రాయి: తుమ్మగూడెం నుంచి ముసునూరు మండలం సూరేపల్లి వరకు నిర్మించనున్న బీటీ రహదారికి ఆదివారం నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ శంకుస్థాపన చేశారు. రాష్ట్ర సహకార యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, సర్పంచ్ మారెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: గోగులంపాడు రామాలయం నుంచి ముక్కొల్లుపాడు వెళ్ళే జడ్పీ రహదారి అభివృద్ధి పనులకు ఆదివారం ఎమ్మెల్యే ప్రతాప్ శంకుస్థాపన చేశారు. సుమారు ఐదుకిలోమీటర్ల పొడవునా ఉన్న ఈ అంతర్గత రహదారిని నాబార్డు నిధులు రూ.4కోట్ల10లక్షలతో బీటీ రోడ్డుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. సర్పంచ్ పిల్లి సత్యనారాయణ, ఎంపీపీ దుర్గాభవానీ, వైస్ ఎంపీపీ కోటగిరి రాజా, జడ్పీటీసీ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: సూరవరంలో నిర్మించిన 33/11కె సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు ప్రారంభించారు.

వైవాకలో అభివృద్ధి పనులు ప్రారంభం

ముదినేపల్లి రూరల్, మార్చి 3: మండలంలోని వైవాక గ్రామంలో రూ. 69.50 లక్షలతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. గ్రామంలో మిగిలిపోయిన అభివృద్ధి పనులకు ప్రాధాన్య క్రమంలో నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. ఎంపీపీ సత్యనారాయణ, జడ్పీటీసీ వెంకటేశ్వరమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సత్కారం


నాగలక్ష్మి దంపతులు సత్కరిస్తున్న మహిళలు

ముదినేపల్లి, మార్చి 3 : భగవద్గీత పారాయణంలో అత్యు త్తమ ప్రతిభ కన బర్చి ఇటీవల మైసూర్ దత్త పీఠాధిపతి చేతుల మీ దుగా అవార్డు అందుకున్న నరసప్ప చెరువు గ్రామాని కి మానికొండ నాగలక్ష్మిని ఆదివారం శ్రీహరిపురం సాయిబాబా మంది రంలో ఘనంగా సత్కరించారు. మచిలీపట్నంకు చెందిన రత్న మాణిక్యం, ఏలూరుకు చెందిన సింగులూరి జయశ్రీ, శ్రీహరిపురానికి చెందిన నీలం సుమతితో పాటు ఆమె వద్ద ఆన్‌లైన్‌లో భగవద్గీత పారాయణం నేర్చుకున్న మహిళలు నాగలక్ష్మి దంపతులను సత్కరించారు.

గంజాయి విక్రేతలకు రిమాండ్

నూజివీడు టౌన్, మార్చి 3: గంజాయి అక్రమ నిల్వ, అమ్మకాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు నూజివీడు రూరల్ సీఐ కె.రామకృష్ణ తెలిపారు. ముసునూరు మండలం చిల్లబోయినపల్లి శివారులో వాహన తనిఖీలు చేస్తుండగా ద్విచక్రవాహనంపై వెళుతున్న నూజివీడు పట్టణానికి చెందిన చింతం విజయ్‌బాబు, షేక్ మొహిద్దీన్, షేక్ మెహరూలను అదుపులోకి తీసుకుని వారి నుంచి 2 కేజీల గంజాయిని స్వాధీన పర్చుకోవడం జరిగిందన్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

వన్యప్రాణులను రక్షించండి

మండవల్లి, మార్చి 3: అంతరించిపోతున్న వన్యప్రాణులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఏలూరు జిల్లా కన్వీనర్ ఎల్.ఎస్. భాస్కరరావు, మండల అధ్యక్షుడు టి. అప్పారావు అన్నారు. వన్యప్రాణుల ఆవశ్యకతపై ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహిం చారు. అడవులను రక్షించండి - వన్యప్రాణులను కాపాడండి, కొల్లేరు చిత్తడి నేలలను రక్షించండి - వన్యప్రాణులను కాపాడండి, ప్రకృతిని రక్షించండి - పర్యావరణాన్ని కాపాడండి.. అంటూ ర్యాలీలో నినాదాలు చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాతో పాటు పారిశ్రామికీకరణ వల్ల సహజ వనరులకు అవరోధం ఏర్పడుతోందన్నారు. ఐక్యవేదిక క్రియాశీలక సభ్యులు కె. మార్కురాజు, బండిరంగారావు, గుడివాడ విజయ రమేష్‌కుమార్, పొన్నూరి రామచంద్రరావు, గంజాల శ్రీనివాసరావు, కె. అదృష్టరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలపై పోరాటం

సంక్షేమ పరిషత్ జాతీయ ముఖ్య సలహాదారు


సమావేశంలో మాట్లాడుతున్న కోర్సా వెంకటేశ్వర్లు

బుట్టాయగూడెం, మార్చి 3: భారత రాజ్యాంగంలో ఆదివాసీ చట్టాల అమలుకు పోరాటాలు తప్పవని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ ముఖ్య సలహాదారు కోర్సా వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం కోయ అంకంపాలెంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ టీచర్స్ అసోషియేషన్ తెలుగు రాష్ట్రాల కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు కాకి మధు అధ్వర్యంలో జరిగింది. 5వ షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనేతరులు 1/59, అమెండ్‌మెంట్ 1/70 చట్టాలు అమలులోకి వచ్చిన తర్వాత అక్రమంగా చొరబడిఏజెన్సీ వనరులను దోచుకుంటున్నారని తెలిపారు. అధికారులు అక్రమ ఎన్‌వోసిలు జారీ చేయడంతో ఆదివాసీ పథకాలను భూస్వాములు దోచుకుంటున్నారని తెలిపారు. ఏజెన్సీలో గిరిజనేతరుల గుర్తింపు కార్డులను రద్దు చేయాలన్నారు. గిరిజనేతరుల చొరబాటుతో జీవో నెంబరు 3 రద్దు అయ్యిందని, దీనిపై ఆదివాసీ ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం బాధకరమన్నారు. యువత మేలుకొని ఆదివాసీల చట్టాల అమలుకు ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. కుంజా శ్రీను, వాబయోగి, వంతల నాగేశ్వరావు, కల్లూరి జయబాబు, తెల్లం రాములు, కణితి శేఖర్, పివి మురళి మనోహర్, యడ్ల సూర్యానారాయణ, సోయం కామరాజు, అప్పన్న, కుంజా కృష్ణంరాజు, తీగల బాబురావు, సరియం నాగేశ్వరావు, కూరం సంజీవరావు, తెల్లం లక్ష్మణ్ మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

లారీ ఢీకొని విద్యార్థి మృతి


రోదిస్తున్నమామ్మ, బాలుడు(ఫైల్)

ఆకివీడు, మార్చి 3: లారీ ఢీకొని విద్యార్థి మృతి చెందాడు. గంగానమ్మకోడ్‌లో తాపీమేస్త్రీ కొట్టాడ మనోహర్ నివశిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు కొట్టాడ వాసుదేవ శ్రీహర్ష (9) ప్రైవేటు పాఠశాలలో నాల్గోవ తరగతి చదువుతున్నాడు. సైకిల్‌పై వెలంపేట రామాలయం వీధిలోకి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మనోహర్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుని బంధువులు, స్థానికులు న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

పెదవేగి, మార్చి 3 : చేసిన అప్పులు కళ్ల ముందు కదలాడుతుంటే, వాటిని తీర్చే మార్గం కనిపించక ప్రాణాలనే తీసుకున్న విషాద ఘటన కవ్వగుంటలో జరిగింది. పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్, స్థానికులు తెలిపిన వివరాలివి.. అద్దులూరి నాగరాజు కొబ్బరి బొండాల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వ్యాపారం నిమిత్తం చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక తీవ్ర మనస్థాపానికి గురై శనివారం పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని ఆసుపత్రికి తీసుకొని వెళ్లారు. చికిత్స పొందుతూ నాగరాజు (56) ఆదివారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కడుపునొప్పితో మరొకరు..


నాగరాజు మృతదేహం

ఏలూరు క్రైం, మార్చి 3 : కడుపునొప్పి భరించలేక రైతు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెదవేగి మండలం కవ్వగుంటకు చెందిన అర్జునూరి నాగరాజు (54) కు భార్య రాణి, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న నాగరాజు కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఆదివారం పురుగుమందు తాగాడు. అస్వస్థతతకు గురైన అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఎమ్మెల్సీ నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం


గిరమ్మ చెరువులో మృతదేహం

కామవరపుకోట, మార్చి 3 : రావికంపాడులోని గిరమ్మ చెరువు వద్ద ముళ్ల పొదల్లో 35-40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని తడికలపూడి పోలీసులు గుర్తించారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తడికలపూడి ఎస్ఐ జయబాబు తెలిపారు. మృతుడు వారం క్రితమే చనిపోయి ఉండవచ్చునని ఎస్ఐ పేర్కొన్నారు. మృతదేహంపై నలుపు రంగు ఫుల్‌హ్యాండ్స్ షర్ట్, జాకీ కంపెనీకి ఎరుపు రంగు డ్రాయర్ ఉన్నాయి కుడిచేతి మణికట్టు వద్ద ఎరుపు రంగు తాడు ఉంది. వివరాలు తెలిసిన వారు 9440796678కు తెలియజేయాలని ఎస్ఐ కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


చికిత్స పొందుతున్న సబ్బారపు వెంకటరమణ

పోలవరం, మార్చి 3 : ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఘటన వివరాలివి.. పట్టిసీమకు చెందిన రైతు సబ్బారపు వెంకటరమణ కన్నాపురం అడ్డరోడ్డు సమీపంలోని పెట్రోలు బంకు పక్కన పంట పొలం నుంచి బైకుపై వస్తుండగా, ప్రగడపల్లి నుంచి ఎదురుగా మరో బైకుపై వస్తున్న గెడ్డం బాలయేసు, గెడ్డం మారేసులు వేగంగా రావడంతో రెండు బైకులు ఢీకొన్నాయి. బాధితులను పోలవరం ఆసుపత్రికి తరలించగా వైద్యాధికారి గెడ్డం జ్యోతి చికిత్స చేసి తీవ్ర గాయాలయిన సబ్బారపు వెంకటరమణను, గెడ్డం బాలయేసును మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గెడ్డం మారేసుకి చికిత్స అందిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలవరం ఎస్ఐ పవన్ కుమార్ ఆసుపత్రికి వెళ్లి ఘటన వివరాలు తెలుసుకున్నారు.

వయ్యేరు కాలువ వద్ద కారు బోల్తా

తణుకు, మార్చి3: దువ్వ వయ్యేరు కాల్వ వద్ద ఆదివారం కారు బోల్తా పడింది. పెనుమంట్ర మండలం మార్టేరుకు చెందిన కుటుంబ సభ్యులు ఉంగుటూరు వద్ద వేడుకకు వెళ్లి తిరుగు ప్రయాణంలో ప్రమాదం జరిగింది. ఘటనలో ఎవ్వరికి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

మానసిక వికలాంగుడికి గాయాలు


చికిత్స పొందుతున్న బాధితుడు

పోలవరం, మార్చి 3 : రక్షణ వ్యవస్థ లేని ట్రాన్స్‌ఫార్మర్ తగిలి మతిస్థిమితం లేని వ్యక్తికి తీవ్ర గాయాలయిన ఘటన కమ్మరగూడెంలో ఆదివారం జరిగింది. వివరాలివి.. కమ్మరగూడెంనకు చెందిన యాదాల సత్యన్నారాయణ మతిస్థిమితం లేక తిరుగుతూ గొంతేలమ్మ ఆలయం వీధిలో అంగన్వాడీకి సమీపంలో రక్షణ వ్యవస్థ లేని ట్రాన్స్‌ఫార్మర్‌ని తాకడంతో మంటలు చెలరేగి గాయాలపాలయ్యాడు. స్థానికులు బాధితుడిని ఆసుపత్రికి తరలించారు. అంగన్వాడీకి సమీపంలో ఉన్న ట్రాన్సాఫార్మర్‌కి ఫ్యూజు కండక్టర్ల ప్రాంతంలో మెస్ డోర్ లేకపోవడం వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గతంలో మేకలు చనిపోయాయని, విద్యుత్ శాఖ అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సొబ్బన మోహన్ కోరారు. ఈ విషయంపై ఏఈ కొండా సత్యన్నారాయణను వివరణ కోరగా తగు చర్యలు తీసుకుంటామన్నారు.


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్

30 కాసుల బంగారం, నగదు చోరీ

ఆకివీడు, మార్చి 3: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో సూదాబత్తుల బాలాజీ వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. బాలాజీ భార్య, సోదరిణులు ఏలూరు, నిజామాబాద్ నుంచి ద్వారకా తిరుమల పెళ్లికి వెళ్ళేందుకు వచ్చారు. శనివారం బంధువులతో కలిసి ద్వారకా తిరుమల వెళ్లారు. ఆదివారం ఇంటికొచ్చే సరికి మొదటి అంతస్తులో తలుపు తెరిచి ఉండడాన్ని గమనించి, లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపు పగలగొట్టి ఉంది. బీరువాలో 30 కాసుల బంగారం, నగదు దొంగిలించారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. క్లూస్‌టీమ్ వేలిముద్రలు సేకరించారు. ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో..

ఏలూరు క్రైం, మార్చి 3 : ఇంటికి తాళం వేసి దంపతులు ఉద్యోగ నిర్వహణకు వెళ్లి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి బంగారు, వెండి వస్తువులు అపహరించుకుపోయారు. ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయినగర్‌లో నివాసం ఉంటున్న ఈదర శ్రీనివాసరావు దంపతులిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ నెల 2వ తేదీన ఇంటి తాళాలు పగులగొట్టి పది కాసుల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు చోరీ చేశారు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవస్థానం కొండగొర్రె మృతి


కొండ గొర్రె కళేబరం

ద్వారకాతిరుమల, మార్చి 3: శ్రీవారి గో సంరక్షణ శాలలో భక్తుల సందర్శనకు ఉంచిన రెండు కొండగొర్రెలలో ఒకటి వైరల్ ఫీవర్‌తో మృతి చెందింది. గతంలో ఈ గొర్రెలు అటవీ ప్రాంతం నుంచి శేషాచల కొండపైకి వచ్చాయి. వీటిని గో సంరక్షణ శాలలో ఉంచారు. ఇవి భక్తులకు ఆహ్లాదాన్ని కలిగించేవి. శనివారం సాయంత్రం ఈ రెండింటికి వైరల్ ఫీవర్ సోకి నీరసించాయి. వెటర్నరీ వైద్యుడు అంగర సురేష్ వైద్య సేవలను అందించారు. ఒకటి మృతి చెందగా మరొకటి కోలుకొంటుందని డాక్టర్ సురేష్ తెలిపారు.

దాడి ఘటనలో రియల్టర్‌పై కేసు నమోదు

ఏలూరు క్రైం, మార్చి 3 : మహిళను బెదిరించి అర్ధరాత్రి ఇంటిపై దాడికి పాల్పడిన వైసీపీ నాయకులు, రియల్టర్ జొన్నకూటి మోహనరావు మరి కొంత మందిపై ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదు అయింది. ఏలూరు శ్రీరామ్‌నగర్ 11వ రోడ్డులో నివసిస్తున్న పైడికొండల కృష్ణకుమారికు తల్లి 336 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేశారు. ఆ స్థలంలో రేకుల షెడ్డు వేసుకుని మూడేళ్ళుగా కృష్ణకుమారి కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. ఆ స్థలాన్ని పది సంవత్సరాల క్రితం తనకు లీజుకు ఇచ్చారని ఖాళీ చేయాలంటూ శనివారపుపేటకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారీ, వైసీపీ నాయకులు జొన్నకూటి రామ్మోహనరావు మరికొందరు కలిసి గత నెల 29వ తేదీ అర్ధరాత్రి ఇంటిపై దాడికి చేసి, బెదిరించారు. వారి వేధింపులు భరించలేక కృష్ణకుమారి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమె ప్రాణాపాయ పరిస్థితిలో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుంది. బాధితురాలు కుమార్తె సౌజన్య ఫిర్యాదు మేరకు ఏలూరు త్రీటౌన్ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. జొన్నకూటి రామ్మోహనరావు, మరి కొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కోడిపందేలు, పేకాట శిబిరాలపై దాడి

పాలకోడేరు, మార్చి 3 : పెన్నాడలో ఆదివారం కోడిపందెలు, పేకాట శిబిరాలపై దాడి చేసి కోతాట ఆడుతున్న నలుగురుని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.1920 నగదు, అదే గ్రామంలో కోడిపందెలపై దాడి చేసి మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని రెండు కోళ్ళు, రెండు కత్తులు స్వాధీనం చేసుకుని వారి నుంచి రూ.2వేలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు తెలిపారు.


ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

చిన వెంకన్న క్షేత్రంలో భక్తుల కోలాహలం

ద్వారకాతిరుమల, మార్చి3: ద్వారకా తిరుమలేశుని దివ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సాధారణ సెలవురోజు కావడంతో పాటు ఈ మాఘమాసంలో శనివారం రాత్రి అధికంగా వివాహాలు జరిగాయి. ఆదివారం పెళ్లి బృందాలు శ్రీవారిని దర్శించుకున్నాయి. దీంతో ఆలయం యాత్రికులతో నిండిపోయింది. ఆలయానికి 15 వేల మంది పైబడి యాత్రికులు స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి.



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

యూటీఎఫ్ ఉద్యమ కార్యాచరణ ఖరారు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 3 : పాత పెన్షన్ పునరుద్దరించాలని యూటీఎఫ్ చేపట్టిన పోరాటంలో భాగంగా మలివిడత ఉద్యమాన్ని ఈ నెలాఖరు వరకు నిర్వహిస్తామని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ప్రకటించారు. ఆదివారం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 10 వరకు అన్ని పాఠశాలల్లో బుక్‌లెట్ స్టిక్కర్స్‌తో ఓట్‌ఫర్ ఓపీఎస్‌పై ప్రచారం, డివిజన్, జిల్లా కేంద్రాలలో రౌండ్‌టేబుల్ సమావేశాలు, 15 నుంచి 30 వరకు అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థులతో చర్చావేదికలు, 26 నుంచి 30 వరకు అన్ని నియోజకవర్గాల్లో బైక్ ర్యాలీలు ఉంటాయన్నారు. 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలోని మహిళా ఉపాధ్యాయులు, అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, కేజీబీవీ టీచర్లు, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయినులు, సమగ్రశిక్ష ఉద్యోగులను ఒకే వేదిక పైకి చేరుస్తామన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తఫాఅలీ, నాయకులు శ్యాంబాబు, కనకదుర్గ, రంగమోహన్, రాంబాబు, సుధారాణి, శివశంకర్, శ్రీనివాసరావు, సాగర్, పీవీ నరసింహారావు పాల్గొన్నారు.

కళా పరిషత్ జాతీయ నాటిక పోటీలు ప్రారంభం

పాలకొల్లు, మార్చి, 3: పాలకొల్లు కళాపరిషత్ 15వ జాతీయ నాటిక పోటీలు ఆదివారం శ్రీఅద్దేపల్లి గంగరాజు సత్రం ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు మూడు రోజులు జరగనున్నాయి. మొదటిగా చైతన్య కళాభారతి కరీంనగర్ కళాకారులతో స్వప్నం రాల్చిన అమృతం నాటిక ప్రదర్శించారు. టీడీడీ బోర్డు సభ్యుడు మేకా శేషుబాబు, పాకా సత్యనారాయణ, గుడాల గోపీ, డీటీడీసీ బాబు కళాపరిషత్ అధ్యక్షుడు కెవి.కృష్ణవర్మ, గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు చౌదరి, ఉపాధ్యక్షుడు డాక్టర్ వర్మ ప్రధాన కార్యదర్శి మానాపురం సత్యనారాయణ పాల్గొన్నారు.